సాక్షి
ఖమ్మం
సోమవారం । 9 । జూన్ । 2025



కనుమరుగవుతున్న 'జ్ఞాపకాలు'

ఖమ్మంలో మోడల్ మార్కెట్ నిర్మిస్తున్న క్రమంలో అంతకుముందున్న కట్టడాలు కూల్చేస్తున్నారు. దీంతో పాత జ్ఞాపకాలు కనుమరుగవుతున్నాయి. 8లో



మృగశిర సందడి..

జిల్లా వ్యాప్తంగా ఆదివారం మృగశిర కార్తె సందడి కనిపించింది. ఈ కార్తె రోజున చేపలు తినాలనే ఆనవాయితీతో కొనుగోళ్లకు పోటీ పడ్డారు. 9లో

గరిష్ఠం / కనిష్ఠం
39° / 29°

వాతావరణం

జిల్లాలో సోమవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఉదయం ప్రారంభమైన ఎండ మధ్యాహ్నానికి తీవ్రమవుతుంది. వడ గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేడు డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లాలో సోమవారం పర్యటించనున్నారు. 3గంటలకు ఖమ్మంలో గౌడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. బహిరంగసభ అనంతరం 6 గంటలకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడెం వెళ్తారు.

పొంగులేటి పర్యటన..

రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 6గంటలకు హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 10.30 గంటలకు కూసుమంచి మండలం పోచారం చేరుకుంటారు. 11.15 గంటలకు ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని మద్దులపల్లిలో సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. 11.45 గంటలకు తెల్దారుపల్లిలో సీసీ రోడ్లకు, 12.15 గంటలకు కస్నాతండాలో సీసీ, బీటీ రోడ్లకు, 12.45 గంటలకు పోలేపల్లిలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు.

ఖమ్మం యువతికి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న వినీల

ఖమ్మం సహకారనగర్ : నగరంలోని మామిళ్లగూడేనికి చెందిన సంగు వినీలకు డాక్టరేట్ లభించింది. మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో 'ఫార్ములేషన్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫ్ గ్యాస్ట్రోరేటేటివ్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్ ఫర్ సం డ్రగ్స్' అంశంపై సమర్పించిన పరిశోధనా పత్రానికి ఈ పురస్కారం దక్కింది. ప్రొఫెసర్ శంకరయ్య పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేయగా.. యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సాత్వికరెడ్డి డాక్టరేట్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీన్ క్రిస్టఫర్, ఎగ్జామ్స్ కంట్రోలర్ రాజేందర్ రెడ్డి, డిప్యూటీ కంట్రోలర్ జగదీష్ కుమార్, కుమారస్వామి, డానియల్, సరిత, సృజన తదితరులు అభినందించారు.

ప్రశాంతంగా ఐసెట్



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

ఖమ్మం సహకారనగర్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన ఐసెట్ జిల్లాలోని ఐదు ఇంజనీరింగ్ కళాశాలల్లో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. రెండు సెషన్లలో పరీక్షలు జరగగా.. విద్యార్థులు సకాలంలో హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి పంపించారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి ఆదివారం అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకోగా, అర్చకులు విశేష పూజలు జరిపారు. అనంతరం భక్తులు అన్నప్రాసనలు, ఒడి బియ్యం, పసుపు కుంకుమలు, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఈ కార్యక్రమాల్లో ఈఓ ఎస్.రజనీకుమారి, వేదపండితుడు పద్మనాభ శర్మ, అర్చకుడు రవికుమార్ శర్మ పాల్గొన్నారు.

వ్యయం	ఒక్కోవైపు గోడ	రెండువైపులా కలిపి	గరిష్ఠంగా ఎత్తు, వెడల్పు	కనిష్ఠంగా ఎత్తు, వెడల్పు
రూ.690 కోట్లు	8.50 కి.మీ.	17 కి.మీ.	45 అడుగులు, 18 అడుగులు	24 అడుగులు, 3 అడుగులు

కరుణగిరి వద్ద మున్నేరు పక్కన నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్



ప్రొటెక్షన్ ఇచ్చేనా ?

గత రెండేళ్లుగా వర్షాకాలం వచ్చిందంటే చాలు మున్నేరు పరీవాహక ప్రాంత కాలనీల వాసులు హడలెత్తుతున్నారు. మున్నేరుకు కనీవినీ ఎరుగని రీతిలో వచ్చిన వరదలు ఖమ్మంరూరల్, ఖమ్మం నగరంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. 2023లో వరదలు రాగా, అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఈ ముంపు నుంచి ప్రజలను రక్షించేందుకు శాశ్వత పరిష్కారంగా రిటైనింగ్ వాల్ నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.690 కోట్లు మంజూరు చేసింది. ఇక గతేడాది సెప్టెంబర్‌లో మరింత ఉధృతంగా వచ్చిన వరదలతో ఈ ప్రాంతమంతా కకావికలమైంది. వరదల నుంచి రక్షణ కోసం రిటైనింగ్ వాల్ నిర్మాణం ప్రారంభమైనప్పటికీ పూర్తయ్యేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ప్రస్తుతం ఖమ్మం రూరల్ వైపు 4.50 కిలోమీటర్ల మేరకు నిర్మాణం పూర్తయింది. ఇక ఖమ్మం నగరం వైపు భూసేకరణ సమస్య కారణంగా 250 మీటర్ల నిర్మాణం మాత్రమే జరిగింది. దీంతో ఈ వర్షాకాలం ఎలా ఉంటుందోననే ఆందోళన లోతట్టు ప్రాంతాల ప్రజల్లో నెలకొంది.

– సాక్షి ప్రతినిధి, ఖమ్మం

ఈ సీజన్‌కూ పూర్తికాని మున్నేరు రిటైనింగ్ వాల్

- ఒక్కో వైపు 8.50 కి.మీ.. మొత్తం 17 కిలోమీటర్ల వాల్
- ఖమ్మం రూరల్ వైపు 4.50 కి.మీటర్ల మేర నిర్మాణం పూర్తి
- భూసేకరణ సమస్యతో ఖమ్మం నగరం వైపు ఆలస్యం
- ఈ ఏడాది కూడా వరదలొస్తాయనే ఆందోళనలో కాలనీల వాసులు

వరుసగా వరదలు..

మున్నేరుకు 2023, 2024లో వచ్చిన వరదలతో నగరంతోపాటు ఖమ్మం రూరల్ ప్రాంతాల్లోని పలు కాలనీల వాసులు తీవ్ర నష్టాన్ని చవిచూశారు. 2023 జూలైలో మున్నేరుకు 30.7 అడుగుల వరద రాగా.. దాదాపు 25 కాలనీలకు నష్టం వాటిల్లింది. ఆయా కాలనీల ప్రజలు సర్వం కోల్పోయారు. ఇక 2024 సెప్టెంబర్‌లో దాదాపు 40 అడుగుల మేరకు వరద వచ్చింది. దీంతో మున్నేటికి రెండు వైపులా సుమారు 50 కాలనీలు పూర్తిగా నీట మునిగాయి. ఇళ్లల్లోకి నీరు చేరడంతో కాలనీవాసులు సర్వం కోల్పోయి కట్టుబట్టలతో బయటకొచ్చారు. సామగ్రి, నగదు, విలువైన పత్రాలు, విద్యార్థతల సర్టిఫికెట్లు ఇలా అన్నీ వరద పాలయ్యాయి. ఈ విపత్తు నుంచి ప్రజలు కోలుకునేందుకు చాలా సమయం పట్టింది.

ముంపు ప్రాంతాల రక్షణకు గోడ..

గతంలో అడపా దడపా వరదలు వచ్చినా మున్నేరుకు 30 అడుగుల మేరకు నీరు చేరలేదు. మొదటిసారి 2023 జూలైలో 30.7 అడుగుల వరద వచ్చింది. ప్రమాదాన్ని గుర్తించిన నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం మున్నేరుకు ఇరువైపులా ఖమ్మం రూరల్, ఖమ్మం నగరం వైపు 8.5 కిలోమీటర్ల చొప్పున మొత్తం 17 కిలోమీటర్ల మేరకు రిటైనింగ్ వాల్ నిర్మించాలని నిర్ణయించింది. ఆ మేరకు రూ.690 కోట్లు విడుదల చేసింది. ఖమ్మం రూరల్ మండలంలో గోళ్లపాడు నుంచి గుదిమళ్ల వరకు, నగరంలో మల్లెమడుగు నుంచి ప్రకాశ్‌నగర్ వరకు ఈ గోడ నిర్మించాల్సి ఉంది. ఒక్కో వైపు కనిష్ఠంగా 24 అడుగుల నుంచి గరిష్ఠంగా 45 అడుగుల వరకు నిర్మించేలా డిజైన్ చేశారు. కాల్వొడ్డు సమీపంలో గరిష్ఠంగా ఈ గోడ ఎత్తు 45 అడుగుల వరకు ఉంటుంది. గత వరదల్లో మున్నేరు నుంచి 3.50 లక్షల క్యూసెక్కు నీరు విడుదల కాగా, ఈ ప్రవాహాన్ని దృష్టిలో పెట్టుకొని రిటైనింగ్ వాల్ నిర్మిస్తున్నారు.

రూరల్ వైపు 4.50 కిలోమీటర్లు పూర్తి..

మున్నేరుకు ఇరువైపులా 8.50 కిలోమీటర్లు చొప్పున 17 కిలోమీటర్ల గోడ నిర్మించాల్సి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టెండర్లు పిలిచి పనులు ప్రారంభించింది. ఖమ్మంరూరల్ మండల పరిధిలో 4.50 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయి. ఇందు కోసం సుమారు రూ.130 కోట్లు ఖర్చు చేశారు. అలాగే మరో మూడు కిలోమీటర్ల నిర్మాణానికి భూసేకరణ పూర్తయింది. ఖమ్మం వైపు 250 మీటర్లు మాత్రమే నిర్మించారు. ఇక్కడ 185 ఎకరాల వరకు భూసేకరణ చేయాలని అధికారులు గుర్తించారు. ఇందుకోసం నిర్వాసితులతో పలు దఫాలు చర్చించినా కొలిక్కి రాలేదు. భూసేకరణ పూర్తయితేనే ఖమ్మం నగరం వైపు నిర్మాణం ఊపందుకోనుంది.




భయం గుప్పిట్లో కాలనీల వాసులు..

రానున్న వర్షాకాలంలో మళ్లీ వరదలు ఎక్కడ ముంచెత్తుతాయోనని లోతట్టు ప్రాంత కాలనీల వాసులు బిక్కుబిక్కుమంటున్నారు. సెప్టెంబర్, అక్టోబర్ నాటికి కూడా రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయ్యేలా లేదు. ఈ నేపథ్యంలో వరదలు వస్తే తమ పరిస్థితి ఏంటనే చర్చ ఆయా కాలనీల్లో జరుగుతోంది. 2023లో వచ్చిన వరదల కంటే 2024లో మరింత ఉధృతంగా వచ్చాయి. ఈసారి కూడా వరదలొస్తే ఉధృతి ఎక్కువగా ఉంటుందనే ఆందోళన కూడా వారిలో నెలకొంది. అయితే గత అనుభవాలను దృష్టిలో పెట్టుకున్న అధికారులు ఇప్పటి నుంచే అప్రమత్తమయ్యారు. ముందు జాగ్రత్త చర్యలపై దృష్టి పెట్టారు. ఇప్పటికే లోతట్టు ప్రాంత అధికారులతో బృందాలను కూడా నియమించారు. వరదల సమయంలో ముందస్తుగా హెచ్చరికలు జారీ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

పెరుగుతున్న సూర్య ప్రతాపం

- వైరాలో గరిష్ఠంగా 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- కోటాకు మించి విద్యుత్ వినియోగం



ఖమ్మంవ్యవసాయం: మృగశిర కార్తె వచ్చినా ఎండ తీవ్రత తగ్గడం లేదు. సాధారణంగా మృగశిర కార్తె నుంచి వర్షాలు కురవడంతో పాటు ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. కానీ ఈ ఏడాది ఎండలు అధికంగా ఉండాల్సిన రోహిణి కార్తె ఆరంభంలో నైరుతి రుతు పవనాలు, ఉపరితల ఆవర్తనంతో వర్షాలు కురిసి కొద్ది రోజులు ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయాయి. ఆ తర్వాత క్రమంగా పెరుగుతున్నాయి. ఆదివారం మృగశిర కార్తె ప్రారంభమైంది. ఈ కార్తెలో ఉష్ణోగ్రతలు తగ్గాల్సి ఉండగా అందుకు భిన్నమైన వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయి. జిల్లాలో ఆదివారం ఎండ తీవ్రత పెరిగింది. వైరాలో గరిష్ఠంగా 42 డిగ్రీలు, ఇంకా అనేక ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎర్రుపాలెంలో 41.5, బచ్చోడులో 41.2, సత్తుపల్లి ఓసీ వద్ద 40.8, ఖమ్మం ప్రకాష్‌నగర్, ఖమ్మం ఖానాపురం, గంగారంలో 40.7, తిరుమలాయపాలెం, మధిర ఏఆర్‌ఎస్, కుర్నవల్లి, గౌరారం, తల్లాడలో 40.6, సత్తుపల్లి, పెద్ద గోపతిలో 40.5, పల్లెగూడెం, ఖమ్మం ఎన్ఎస్‌పీ, రఘునాథపాలెంలో 40.4, ముదిగొండలో 40.3, వేంసూరు, చింతకానిలో 40.2, పెనుబల్లిలో 40.1, మధిర, పమ్మిలలో 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కనిష్ఠంగా బాణాపురంలో 37.3 డిగ్రీలుగా ఉంది.

పెరిగిన విద్యుత్ వినియోగం..


ఎండ తీవ్రత పెరుగుతున్న క్రమంలో విద్యుత్ వినియోగం కూడా పెరుగుతోంది. జిల్లాకు కేటాయించే కోటాకు మించి వినియోగిస్తుండడం గమనార్హం. ప్రస్తుతం వ్యవసాయ విద్యుత్ వినియోగం అంతగా లేకున్నా గృహ వినియోగం మాత్రం గణనీయంగా పెరుగుతోంది. ప్రస్తుతం జిల్లా విద్యుత్ కోటా రోజుకు 4.73 మిలియన్ యూనిట్లు కాగా శుక్రవారం 5.581 మిలియన్ యూనిట్లు, శనివారం 5.611 మిలియన్ యూనిట్ల వినియోగం నమోదైంది. అంటే రోజువారి కోటాతో పోలిస్తే దాదాపు 1 మిలియన్ యూనిట్ల విద్యుత్ అదనంగా ఖర్చవుతోంది. గృహ విద్యుత్ వినియోగం పెరగడంతో గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా లో వోల్టేజీ సమస్య ఎదురవుతోంది.

దుక్కులు చేసి ఎదురుచూస్తున్న రైతులు

మే నెలలో కురిసిన అకాల వర్షాలతో దుక్కులు సిద్ధం చేసిన రైతులు విత్తనాలు వేసేందుకు వానల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో రెండో ప్రధాన పంట అయిన పత్తి సాగుకు విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. అపరాల పంటలైన పెసర, కంది విత్తనాలు కూడా అందుబాటులో ఉన్నాయి. కొందరు రైతులు వరి నారు మళ్లు దున్నుకొని విత్తనాలు సేకరించే పనిలో ఉన్నారు. 6 నుంచి 7 సెం.మీ. వర్షం కురిస్తే వెంటనే పత్తి విత్తనాలు వేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఈనెల 20 వరకు పత్తి విత్తనాలు వేసుకునే అవకాశం ఉంది.

ఆడకుండానే సర్టిఫికెట్లు..!

- జాతీయస్థాయి పోటీలకు వెళ్తున్న నకిలీ క్రీడాకారులు
- ప్రోత్సహిస్తున్న క్రీడా సంఘాలు
- స్కూల్ గేమ్స్‌లో మరింత విచ్చలవిడిగా..



ఖమ్మం స్పోర్ట్స్ : క్రీడలపై అవగాహన లేకపోయినా సరే తామే జాతీయస్థాయిలో ఆడించేలా చర్యలు తీసుకుంటే ఎంత ఇస్తారంటూ బేరసారాలు సాగిస్తున్నాయి కొన్ని క్రీడా సంఘాలు. ఈ వ్యవహారం టీం క్రీడల్లో ఎక్కువగా జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో ప్రధానంగా క్రీడా సంఘాల ప్రతినిధులు సైతం జోక్యం చేసుకోవడంతో ఈ దందా మరింత విచ్చలవిడిగా కొనసాగుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా నకిలీ క్రీడాకారులు కేవలం టీం క్రీడాంశాల్లోనే జిల్లా, రాష్ట్ర జట్లలో ఎంపికై జాతీయ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఓ టీం గేమ్‌కు సంబంధించిన జట్టులో సగం మంది ఆడే క్రీడాకారులను తీసుకుని, మిగిలిన జట్టు సభ్యులుగా ఎక్కువ డబ్బు ఇచ్చిన వారిని పెడుతున్నారని తెలుస్తోంది. గతంలో అప్పటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కొన్ని క్రీడా సంఘాలకు మొట్టికాయలు వేసినా.. క్రీడా సంఘాల్లో మార్పు లేదు. దీనిని నియంత్రించేందుకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ, రాష్ట్ర ఒలింపిక్ సంఘం క్రీడాకారుల ఎంపిక దశలోనే ఒక కమిటీ వేసి నకిలీ క్రీడాకారులకు చెక్ పెట్టాలని పలువురు కోరుతున్నారు. జిల్లా స్థాయిలోనే అయా క్రీడా సంఘాలు నిర్వహించే ఎంపికల్లో సదరు క్రీడాకారుడు ఆడుతున్నడా లేదా అనేది పరిశీలించేందుకు కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్నారు. కేవలం టీం గేమ్స్‌లోనే కాకుండా వ్యక్తిగత క్రీడాంశాల్లో కూడా నకిలీ క్రీడాకారులను సృష్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

పాఠశాలల క్రీడల్లో అధికం..

క్రీడా సంఘాలకే పరిమితం చేయకుండా రాష్ట్ర పాఠశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన జరిగే వివిధ క్రీడా పోటీల్లోనూ సగం మంది నకిలీ క్రీడాకారులు జాతీయస్థాయి పోటీలకు వెళ్తున్నారనే ఆరోపణలున్నాయి. ముందుగా రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల సమయంలో జట్టును ప్రకటించకుండా తర్వాత ప్రకటిస్తామని చెప్పి.. తీరా జాతీయ పోటీలకు జట్టు వెళ్లే సమయంలో క్రీడాకారులకు సమాచారం అందించి ఒకరోజు ముందుగానే రావాలని చెబుతున్నారు. దీంతో వివిధ కారణాలతో ఎంపికైన క్రీడాకారులు రాలేకపోతే ముందస్తుగానే తమ వద్ద ఉన్న నకిలీ క్రీడాకారులను నేరుగా జాతీయ పోటీలకు తీసుకెళ్తున్నారనే విమర్శలున్నాయి.

రాత పరీక్ష ఎప్పుడో..?

- సింగరేణిలో మార్చి 2024లో ఇంటర్నల్ నోటిఫికేషన్
- పరీక్ష కోసం 15 నెలలుగా ఎదురుచూస్తున్న కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): నోటిఫికేషన్ విడుదల చేసి 15 నెలలు గడిచినా సింగరేణిలో ఇంటర్నల్ క్లరికల్ రాత పరీక్ష నిర్వహించడంలేదు. 360 క్లరికల్ పోస్టుల భర్తీకి సింగరేణి యాజమాన్యం 2024 మార్చిలో ఇంటర్నల్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో సంస్థవ్యాప్తంగా 7 వేల మంది కార్మికులు దరఖాస్తు చేసుకున్నారు. 15 నెలలైనా పరీక్ష నిర్వహించకపోవడంతో దరఖాస్తుదారులు నిరాశ చెందుతున్నారు. నోటిఫికేషన్ ఇచ్చే నాటికి 360 పోస్టులు ఉండగా, ప్రతి నెలా కొందరు కార్మికులు ఉద్యోగ విరమణ పొందుతుండటంతో ఖాళీల సంఖ్య ఇంకా పెరిగిందని, ప్రస్తుతం సుమారు 500 పోస్టులు ఖాళీగా ఉన్నాయని కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. ఇటీవల డిపెండెంట్ ఉద్యోగాలకు ఎక్కువ మంది విద్యావంతులు ఎంపికయ్యారు. నిబంధనల ప్రకారం వారిని బదిలీ వర్కర్‌గా నియమించిన యాజమాన్యం.. వారితో క్లరికల్ విధులు నిర్వహింపజేస్తోంది. బదిలీ వర్కర్ వేతనం పొందుతూ క్లరికల్ పనులు చేయాల్సివస్తోందని వారు వాపోతున్నారు.



సింగరేణి ప్రధాన కార్యాలయం

ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్లు ఏవీ..?

2024 సంస్థ 327 క్లరికల్ పోస్టుల భర్తీకి ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ తర్వాత మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వలేదు. సింగరేణి సీఎండీగా ఎన్.బలరామ్ బాధ్యతలు చేపట్టాక ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించారు. ఏడాది గడిచినా ఇంతవరకు ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదు. ఇచ్చినా నోటిఫికేషన్‌కు సంబంధించిన పరీక్షా నిర్వహించలేదు. ఇక రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం పోస్టులో ఇటీవల కాలంలో ముగ్గురు అధికారులు మారారు. ఈ పోస్టులో ఏ ఒక్క అధికారి పూర్తిస్థాయిలో పనిచేయని కారణంగా నోటిఫికేషన్లు జాప్యమవుతున్నాయని కార్మిక నాయకులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సింగరేణి ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే 2024 మార్చి నోటిఫికేషన్ రాత పరీక్ష నిర్వహించాలని, ఖాళీల భర్తీకి కొత్త నోటిఫికేషన్లు ఇవ్వాలని కోరుతున్నారు.

నేడు గిరిజన దర్బార్

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న గిరిజన దర్బార్ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే గిరిజన దర్బార్‌లో గిరిజనులు సమస్యలపై ఫిర్యాదులు అందజేయాలని పేర్కొన్నారు.

పట్టాలెక్కని 'ప్రీ స్కూల్'

- భర్తీకి నోచుకోని అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ పోస్టులు
- ఉన్న వారిపై అదనపు భారం
- టీచర్లు లేక తగ్గుతున్న ప్రవేశాలు

ఎర్రుపాలెం: జిల్లాలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రీ స్కూల్ విద్య(పూర్వ ప్రాథమిక విద్య) జిల్లాలో పక్కదారి పడుతోంది. జిల్లాలోని ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 6 నెలల నుంచి మూడేళ్ల పిల్లలు 34,691 మంది, 3 – 6 సంవత్సరాల వయసు చిన్నారులు 20,012 మంది ఉన్నారు. వీరితో పాటు 12,715 మంది గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నారు. కాగా అనేక అంగన్‌వాడీ కేంద్రాల్లో ఏళ్ల తరబడి ఖాళీగా ఉన్న టీచర్, హెల్పర్ పోస్టులు భర్తీకి నోచుకోవడం లేదు. ఇతర శాఖల్లో సిబ్బంది, ఉపాధ్యాయుల కొరత ఉండడంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న పలు సర్వేలకు అంగన్‌వాడీ టీచర్లనే వినియోగిస్తున్నారు. ఇక టీచర్ పోస్టు ఖాళీగా ఉన్న కేంద్రాల్లో పక్క సెంటర్ కార్యకర్తకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఇలా ఇతర విధుల్లో వారు నిమగ్నమవుతుండగా.. కేంద్రాల్లో టీచర్లు లేరంటూ చిన్నారులను పంపేందుకు తల్లిదండ్రులు విముఖత చూపుతున్నారు. చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో 5 నుంచి 8 మంది పిల్లలు మాత్రమే ఉంటున్నారు. పలుచోట్ల కేంద్రాల నిర్వహణ సక్రమంగా లేక చిన్నారులకు అందాల్సిన పోషకాహారం కూడా పంపిణీ కావడం లేదు. ఇలాంటి కారణాలతో పూర్వ ప్రాథమిక విద్య పక్కదారి పడుతోంది.



తెల్లపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బోధిస్తున్న టీచర్

వేధిస్తున్న కొరత..

జిల్లాలో 1,840 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా 123 మంది టీచర్లు, 620 హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మధిర ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మధిర, వైరా, బోనకల్, ఎర్రుపాలెం మండలాల్లో 31 టీచర్ పోస్టులు, 84 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సిబ్బంది కొరతతో ఉన్నవారిపై మరింతగా భారం పడుతోంది. ఉన్న వారితోనూ వివిధ ప్రభుత్వ శాఖల సర్వేలు, వర్షాకాలంలో వారానికి రెండు సార్లు గ్రామాల్లో శానిటేషన్ విధులు, వైద్య శాఖ నిర్వహించే డీవార్మింగ్ మందుల పంపిణీ, పల్స్ పోలియో, ఇంటింటి సర్వే, ఇందిరమ్మ ఇళ్ల సర్వే, బడిబాట తదితర పనులు చేయిస్తున్నారు. దీంతో టీచర్లపై పనిభారం పెరగగా.. వేతనాలు మాత్రం అంతంతగానే అందుతున్నాయి.


సర్వేల నుంచి మినహాయించాలి..



మాతో ప్రభుత్వం రకరకాల సర్వేలు చేయిస్తోంది. గ్రామాల్లోకి సర్వేలకు వెళ్లిన సమయంలో కేంద్రాల్లో ఉండడం లేదంటూ చిన్నారుల తల్లిదండ్రుల నుంచి ఒత్తిడి వస్తోంది. ఇటు కేంద్రాల నిర్వహణ, అటు సర్వే పనులు చేయడం కష్టంగా ఉంది. ప్రభుత్వం ఆలోచించి ఆయా సర్వేల నుంచి మాకు మినహాయింపు ఇవ్వాలి.

– కర్నాటి కృష్ణకుమారి, అంగన్‌వాడీ టీచర్, బుచ్చిరెడ్డిపాలెం, ఎర్రుపాలెం మండలం

పని భారం పెరిగింది



అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టుల భర్తీ లేక ఉన్నవారిపై పని భారం పెరుగుతోంది. పక్క కేంద్రాల నిర్వహణ బాధ్యతలు కూడా చూడాల్సి వస్తోంది. కొన్ని చోట్ల హెల్పర్లు కూడా లేక కేంద్రాన్ని మూసి సర్వేలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోంది. మాకు జీతం రూ.13,500 మాత్రమే ఇస్తూ చాకిరీ ఎక్కువగా చేయిస్తున్నారు.

– బండి జయమ్మ, అంగన్‌వాడీ టీచర్, చొప్పకట్లపాలెం, బోనకల్ మండలం

పోస్టుల భర్తీకి త్వరలో నోటిఫికేషన్



అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి జూలైలో నోటిఫికేషన్ రావొచ్చు. ఖాళీల వివరాలను ప్రభుత్వం సేకరించింది. ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదంతో ఖాళీల భర్తీకి రోస్టర్ ప్రక్రియ కొనసాగుతుండగా జాప్యం జరుగుతోంది. గ్రామాల్లో బీఎల్‌ఓల విధులు భారంగా ఉన్నా తప్పని పరిస్థితి నెలకొంది. బడిబాట, డీవార్మింగ్ ట్యాబ్లెట్ల పంపిణీ వంటివి మాత్రం ఐసీడీఎస్ విధుల్లో భాగమే.

– ఆర్.రాంగోపాల్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి

రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామివారికి ఆదివారం అంతరాలయంలో అభిషేకం, సువర్ణ పుష్పార్చన జరిపించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, సెలవు రోజు కావడంతో స్వామివారి దర్శనానికి భక్తులు బారులుదీరారు.



నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు (ఇన్‌సెట్) స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

తరగతి గది నుంచే భవిష్యత్‌కు పునాది



వశిష్ట క్యాంపస్ ప్రారంభిస్తున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మంఅర్బన్: విద్యార్థుల భవిష్యత్ తరగతి గదుల నుంచి ప్రారంభమవుతుందని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ కదారి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పాఠశాల నాలుగో ఏడాదిలోకి అడుగు పెడుతున్న సందర్భంగా విశిష్ట క్యాంపస్ ప్రారంభించి మాట్లాడారు. నిర్బంధ విద్యకు తాను పూర్తిగా వ్యతిరేకమని, విలువలతో కూడిన విద్య, అభివృద్ధికి దోహద పడే టెక్నాలజీతో విద్యా పద్ధతులు తమ పాఠశాలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మంత్రి పొంగులేటి క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జ్ దయాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు ఏరువాక అగ్రి ఎక్స్‌లెన్స్ అవార్డు



అవార్డు అందుకుంటున్న వెంకట్రామిరెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని మీనవోలు గ్రామానికి చెందిన ప్రకృతి సేద్యం చేస్తున్న రైతు కుడుముల వెంకట్రామిరెడ్డికి ఏరువాక అగ్రి ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కింది. హైదరాబాద్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు, మాజీ మంత్రి బాబూమోహన్, సినీ నటి కవిత, నవ నిర్మాణ ఫౌండేషన్ చైర్మన్ పొన్నాల రాంబాబు తదితరులు రైతుకు అవార్డుతో పాటు ప్రశంసా పత్రం, రూ.2,116 నగదు అందజేశారు.

ఆటో పల్టీ.. ఏడుగురికి గాయాలు

కామేపల్లి: ఆటో పల్టీ కొట్టిన ఘటనలో పలువురికి గాయాలైన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం గ్రామానికి చెందిన పలువురు లింగాల క్రాస్ రోడ్డు నుంచి డోర్నకల్ వైపు ఆటోలో వెళ్తుండగా బండిపాడు స్టేజీ సమీపంలోని మూలమలుపు వద్ద ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళకు తీవ్ర గాయాలు కాగా మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను డోర్నకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సరిహద్దు గ్రామాల్లో తనిఖీలు

చర్ల: మండలంలోని సరిహద్దు గ్రామాల్లో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఆదివారం చర్లలో జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆదివాసీలు నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చారు. వారి మాటున మావోయిస్టులు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు తనిఖీలు చేపట్టాయి. ప్రతీ ఒక్కరిని నిశితంగా పరిశీలించారు. సీఐ రాజువర్మ నేతృత్వంలో ఎస్‌ఐలు నర్సిరెడ్డి, కేశవ్ సివిల్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

అడవులను రక్షించుకుందాం

భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు



కనకగిరి గుట్టలపైకి కాలినడకన వెళ్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

చండ్రుగొండ : పర్యావరణ పరిరక్షణ కోసం అడవులను రక్షించుకుందామని ఎస్పీ రోహిత్ రాజు పేర్కొన్నారు. మండలంలోని బెండాలపాడు శివారు కనకగిరి అటవీ ప్రాంతాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. గుట్టలపై భాగంలో ఉన్న వీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించి, పూజలు చేశారు. అనంతరం పర్యాటకుల కోసం గుట్టలపైభాగంలో ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్‌ను పరిశీలించారు. అనంతరం బ్యాంబో క్లస్టర్‌ను సందర్శించారు. వెదురు ఉత్పత్తులను తిలకించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అడవులను, అటవీ సంపదను కొల్లగొట్టేవారిపట్ల కఠినంగా వ్యవహరించాలని, అందుకోసం పోలీసుశాఖ సహకారం అందిస్తుందని తెలిపారు. డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఫారెస్టు రేంజర్ ఎల్లయ్య పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,748

కనుమరుగవుతున్న 'జ్ఞాపకం'..

బీట్‌బజార్ నుంచి ఎదిగిన ఖమ్మం మార్కెట్

- తొలుత గ్రెయిన్ మార్కెట్‌గా పేరు..
- మోడల్ మార్కెట్ పేరుతో పాత నిర్మాణాల తొలగింపు
- రూ.155.30 కోట్లతో మారుతున్న రూపురేఖలు





ఒక్కటొక్కటిగా తొలగిస్తున్న మార్కెట్‌లోని నిర్మాణాలు (ఇన్‌సెట్) తొలగించనున్న మార్కెట్ ముఖద్వారం

ఖమ్మం వ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ జ్ఞాపకాలు కనుమరుగవుతున్నాయి. మోడల్ మార్కెట్ నిర్మాణంలో భాగంగా పాత నిర్మాణాలను తొలగిస్తున్నారు. కాగా, రెండు తెలుగు రాష్ట్రాల్లోనే మిర్చి అమ్మకాలకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ప్రసిద్ధి కావడంతో ఉమ్మడి ఖమ్మం, వరంగల్, కరీంగనర్, నల్లగొండ, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలతో పాటు పొరుగున ఉన్న ఏపీ రాష్ట్రంలోని పలు జిల్లాల రైతుల సైతం అమ్మకాలకు ఇక్కడకు వస్తుంటారు. దీంతో మిర్చి సీజన్‌లో నిత్యం లక్ష నుంచి 2 లక్షల బస్తాల వరకు పంట విక్రయాలు సాగుతున్నాయి. ఈ క్రమంలో యార్డులు సరిపోవడం లేదని పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధునాతన మార్కెట్ నిర్మాణాలకు రూ. 155.30 కోట్లు మంజూరు చేయించారు. ప్రస్తుతం మిర్చి సీజన్ ముగియడం, వేసవి సెలవులు ప్రకటించడంతో పాత నిర్మాణాలను సమూలంగా తొలగిస్తూ నూతన నిర్మాణ పనులను చకచకా చేయిస్తున్నారు.

75 ఏళ్ల నాటి గుర్తులు..

బ్రిటీష్ కాలం 1937లో నలుగురైదుగురు వ్యాపారులు కలిసి పరిసరప్రాంతాల రైతుల సౌకర్యార్థం గాంధీచౌక్‌లో బీట్‌బజార్ ఏర్పాటు చేశారు. కాలానుగుణంగా జిల్లాలో నీటి వనరులు పెరగడం, సాగు విస్తీర్ణం పెరగడంతో మార్కెట్ ఆవశ్యకత పెరిగి ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌గా గుట్టల బజార్‌లో ఏర్పాటైంది. అయితే 1969 నుంచి ప్రభుత్వం మార్కెట్ చట్టాన్ని అమలు చేయగా.. క్రమక్రమంగా దాదాపు 40 ఎకరాల విస్తీర్ణంగా రూపుదిద్దుకుని పంటల కొనుగోళ్లలో గుర్తింపు సాధించింది. తొలుత అపరాలు, ఆపై పత్తి, మిర్చి పంటల సాగు పెరగడంతో ఖమ్మం మార్కెట్ అభివృద్ధి సాధించింది. అపరాల కొనుగోళ్లకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యార్డు ప్రస్తుతం మిర్చి యార్డుగా మారింది. ఈ యార్డులో 22 షెడ్లు, భూసార పరీక్షా కేంద్రం, మార్కెట్ కార్యాలయం ఉన్నాయి. దీంతో పాటు ఈ యార్డుకు పక్కనే మిర్చికి ప్రత్యేకంగా నిర్మించి.. మరో షెడ్, గోదాములు, జిల్లా మార్కెటింగ్ శాఖ కార్యాలయం, కార్మికుల కార్యాలయాలను కూడా తొలగించడంతో ఆనాటి గుర్తులన్నీ కనుమరుగయ్యాయి.

పాత నిర్మాణాలపై భావోద్వేగం

మార్కెట్ పాత నిర్మాణాలు కనుమరుగవుతుండడంతో ఇక్కడ పనిచేసే వ్యాపారులు, కార్మికులు భావోద్వేగానికి గురవుతున్నారు. కొందరు మార్కెట్ తొలగిస్తున్న వీడియోలు తీసి పాటలు జోడించి సోషల్ మీడియాలో పెడుతుండగా.. మరికొందరు యార్డులో వ్యాపారులకు కేటాయించిన స్థానాలు, నిత్యం పనిచేసే ప్రాంతాలు, భోజనం చేసే ప్రాంతాలు, చెట్ల తొలగింపు చూసి బాధను వ్యక్తపరుస్తున్నారు. ఈ మార్కెట్‌లో సుమారు 600 మంది వ్యాపారులు, 3 వేల మంది కార్మికులు పని చేస్తుండగా.. పరోక్షంగా నగరంలోని త్రీటౌన్ ప్రజలువివిధ రకాలుగా ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.

రైతుల ప్రయోజనం కోసం

రైతుల ప్రయోజనం కోసం ఖమ్మం మార్కెట్‌ను అభివృద్ధిలో భాగంగా పాత నిర్మాణాలను తొలగించి మోడల్ మార్కెట్‌గా రూపురేఖలు మార్చుతోంది. 7 అధునాతన షెడ్లతో పాటు ఒక కోల్డ్ స్టోరేజీ నిర్మాణాలకు శ్రీకారం చట్టారు. మార్చి నుంచి మార్కెట్‌లోని ఓ భాగంలో ప్రారంభించిన పనులను ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో పూర్తిస్థాయిలో పనులను చేపట్టారు. రెండేళ్ల క్రితం గత ప్రభుత్వం రూ.10 కోట్లతో నిర్మించిన షెడ్లను కూడా తొలగించి 15.39 ఎకరాల్లో నిర్మాణాలను చేపట్టారు. అజిలిటి భూమి కంపెనీ ఈ నిర్మాణ పనులను నిర్వహిస్తుండగా.. 2026 జూన్ నాటికి పనులను పూర్తయ్యేలా ఒప్పందం కుదుర్చుకుంది.

అంచెలంచెలుగా ఎదిగింది..



ఖమ్మం మార్కెట్ అంచెలంచెలుగా ఎదగడంలో వ్యాపారులది కీలక పాత్ర. ఇప్పుడు కొత్త నిర్మాణాలతో జ్ఞాపకాలు కనుమరుగవుతున్నాయి. అయినప్పటికీ ఈ మార్కెట్ ఇప్పుడు మోడల్ మార్కెట్‌గా అభివృద్ధి చెందుతుండడం ఆనందంగా ఉంది.

– పెనుగొండ రామ్మోహన్‌రావు, పూర్వ వ్యాపారి, ఖమ్మం

మిర్చి కొనుగోళ్లకు కేంద్రం



తెలుగు రాష్ట్రాల్లో పండించే తేజా రకం మిర్చి అధికంగా ఇక్కడే విక్రయిస్తారు. దీంతో మోడల్ మార్కెట్ నిర్మాణంతో మార్కెట్ స్థాయి మరింతగా పెరిగే అవకాశం ఉంది. అయితే పాత నిర్మాణాలు తొలగిస్తుండడం కొంత బాధను కలిగిస్తోంది.

– మలిశెట్టి వెంకటేశ్వర్లు, మిర్చి ఖరీదుదారు, ఖమ్మం

శ్రామికులకు అన్నం పెట్టే మార్కెట్



మార్కెట్ ఆవిర్భావం నుంచి మాకు అనుబంధం ఉంది. అప్పట్లో వ్యాపారులు కొనుగోలు చేశాక పంటను ఎడ్లబండ్లపై వారి గోదాములకు తరలించేవాళ్లం. అనాదిగా మార్కెట్ వేలాది మంది కార్మికులకు అన్నం పెడుతోంది. మరింత అభివృద్ధి సాధిస్తుండడం ఆనందంగా ఉంది.

–నున్నా మాధవరావు, కార్మిక వర్గాల ప్రతినిధి, ఖమ్మం

కలవరపెడుతున్న గ్యాంగ్‌వార్

- రోజురోజుకూ పెరుగుతున్న హింసాప్రవృత్తి
- హత్యలను ఫ్యాషన్‌గా భావిస్తున్న యువత
- కట్టడి చేయటంలో పోలీస్ శాఖ విఫలం



భద్రాచలం: ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న భద్రాచలం ఆధ్యాత్మిక క్షేత్రంలో హత్యలు జరుగుతున్నాయి. పర్యాటకులకు, భక్తులకు మరుపురాని అనుభూతులను అందించే భద్రగిరిలో ఇటీవలి కాలంలో యువతలో హింసాప్రవృత్తి నానాటికీ పెరిగిపోతోంది. మత్తు పదార్థాలు, మద్యానికి బానిసలవుతున్న యువత.. హింస, గొడవలను ఫ్యాషన్‌గా భావిస్తూ హత్యలకు సైతం తెగబడుతున్నారు. కట్టడి చేయాల్సిన రక్షణ శాఖ విఫలమవ్వటంతో పాటుగా అవినీతి ఆరోపణలతో కూరుకుపోతోంది.

పెరుగుతున్న గొడవలు..

జిల్లాలో ఇండస్ట్రియల్ ఏరియాలు, కొన్ని ప్రాంతాలకే పరిమితమైన గ్యాంగ్‌వార్‌ల విష సంస్కృతి భద్రాచలానికి పాకింది. గతంలో కేవలం గొడవలకే పరిమితమైన ఈ వార్‌లు ప్రస్తుతం హత్యలకు సైతం దారి తీస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. గత ఏడాది హోలీ రోజున భద్రాచలానికి చెందిన యువకుడిని ఏపీలోని వెంకటరెడ్డిపేటలో మూకుమ్మడిగా దాడి చేసి హత్య చేశారు. రెండు రోజుల కిందట పట్టణంలోని జగదీశ్‌కాలనీకి చెందిన సతీశ్‌ను చంపారు. ఇంట్లో ఉండగానే, కుటుంబ సభ్యులు అడ్డుకుంటున్నా అందరి ముందే హత్య చేయటం యువకుల్లో పెరుగుతున్న హింసాప్రవృత్తికి నిదర్శనం.

ఫ్యాషన్‌గా మారుతున్న క్రైం

సినిమాలు, టీవీలు, ఓటీటీ కంటెంట్‌లో చూపిస్తున్న మత్తు పదార్థాలు, మద్యం వాడకం యువతపై తీవ్రప్రభావం చూపుతున్నట్లు తెలుస్తోంది. హింస కంటెంట్‌గా వస్తున్న సినిమాలతో పాటుగా యువతలో నానాటికీ లోపిస్తున్న మానవతా విలువలు ఇలాంటి ఘటనలకు దారితీస్తున్నట్లు సమాచారం. విచ్చలవిడిగా దొరుకుతున్న గంజాయి, బెల్ట్‌షాపుల్లో నిరంతరం లభిస్తున్న మద్యంతో యువత చెడుమార్గం పడుతుండగా.. కొందరు ప్రముఖుల, రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం ఈ గ్యాంగ్‌లను పోషిస్తున్నారనే అపవాదు సైతం ఉంది. వీరి అండదండలు, ప్రోత్సాహంతో యువత సైతం తల్లిదండ్రుల లక్ష్యాలను, భవిష్యత్‌ను పక్కకు పెట్టి హింసవైపు పరుగులు తీస్తున్నారు.

పోలీస్ శాఖ విఫలం..

భద్రాచలంలో పెట్రేగిపోతున్న హింస, గొడవలను అరికట్టడంలో పోలీస్ శాఖ విఫలమవుతోందనే ఆరోపణలు ఇటీవల కాలంలో భారీగా పెరిగాయి. గంజాయి అక్రమ రవాణాకు ప్రధాన కేంద్రంగా ఉన్న భద్రాచలంలో వీటిపై మాత్రమే దృష్టి సారించిన రక్షణ శాఖ పెరుగుతున్న గంజాయి వాడకం, గొడవలను అరికట్టడంలో వెనుకబడ్డారని విమర్శలు వస్తున్నాయి. అవినీతి సొమ్ముకు ఆశ పడి ఏడాది కాలంలోనే భద్రాచలం పోలీస్ శాఖలో ఇద్దరు ఉన్నతస్థాయి అధికారులు పట్టుబడటం సైతం పోలీసులపై ఉన్న నమ్మకాన్ని తగ్గిస్తోంది. ఇసుక, మైనింగ్ మాఫియాకు అండగా ఉంటూ ప్రధాన కర్తవ్యాన్ని విస్మరిస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా పోలీస్ అధికారులు పెట్రోలింగ్‌ను పెంచి, గొడవలకు దిగుతున్న యువకులకు కౌన్సెలింగ్ ఇస్తూ చెడు వ్యవసనాలకు బానిస కాకుండా పటిష్ట రక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలి..



చందర్‌రావుతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న లక్ష్మీనారాయణ

కల్లూరురూరల్: ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగాలని, అప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాలువ సుజాత, ఏపీ జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ అన్నారు. తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా పసుమర్తి చందర్‌రావు ప్రమాణ స్వీకారం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఆర్యవైశ్యులు రాజకీయ రంగంలో కూడా ఎదగాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ రాష్ట్రఅధ్యక్షులు అమరవాది లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఈ సందర్భంగా చందర్‌రావుతోపాటు ప్రధాన కార్యదర్శులుగా గోళ్ల రాధాకృష్ణ, వనమా కిరణ్, ఉపాధ్యక్షుడుగా వీరదల్లి రాజేశ్, నూకల శ్రీనివాసరావు, కోశాధికారిగా పసుమర్తి వెంకటేశ్వరరావు, ప్రచార కార్యదర్శిగా కొప్పరపు బలరాం, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంగిశెట్టి జగదీశ్‌కుమార్, నాగుబండి శ్రీనివాసరావు, ఆర్యవైశ్య జిల్లా మహిళా అధ్యక్షురాలిగా దోసపాటి సంధ్యారాణి, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా పసుమర్తి రాంబాబు, ప్రమాణ స్వీకారం చేశారు.

మానసిక స్థైర్యం కల్పించాలి



చిన్నారులతో గిరిసింహారావు తదితరులు

- తలసేమియాతో చిన్నారుల ప్రాణాలకు ప్రమాదం లేదు
- టీజీఎస్‌ఆర్టీసీ కరీంనగర్ జోనల్ వైద్యాధికారి గిరిసింహారావు

ఖమ్మంవైద్యవిభాగం: తలసేమియా వ్యాధితో చిన్నారులకు ఎలాంటి ప్రమాదం ఉండదని, వారితో పాటు తల్లిదండ్రుల్లోనూ మానసిక స్థైర్యం కల్పించాలని టీజీఎస్‌ఆర్టీసీ కరీంనగర్ జోనల్ వైద్యాధికారి గిరిసింహారావు అన్నారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చిన్నారులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసేమియాతో ప్రమాదం లేకున్నా ఆ వ్యాధిని తలుచుకుని బాధ పడడం వలనే మరింత అనారోగ్యాలకు గురవుతారని చెప్పారు. చిన్నారులు సాధారణ జీవితం గడిపేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. క్రమం తప్పకుండా రక్తం ఎక్కించుకుంటూ, మందులు వాడితే ఎలాంటి ఇబ్బంది ఉండదని అన్నారు. బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి మాట్లాడుతూ తలసేమియా చిన్నారులకు అండగా ఉండేందుకు సంకల్ప సంస్థతో కలిసి నడుస్తామని అన్నారు. చిన్నారుల కోసం ప్రతీ మూడు నెలలకు ఒకసారి రక్తదాన శిబిరం ఏర్పాటు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో సంకల్ప సంస్థ ఫౌండర్ పి.అనిత, ఉపాధ్యక్షురాలు పి.పావని, కోశాధికారి పి.రవిచందర్, ఉదయ్‌భాస్కర్, వంశీకిరీటి, ఉపేందర్, మధు, ప్రముఖ మీడియా ప్రతినిధి అడప నాగేందర్, డాక్టర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు ప్రముఖుల నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

రఘునాథపాలెం: బీఆర్‌ఎస్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా.. ఆదివారం ఆయన స్వగ్రామమైన రఘునాథపాలెం మండలంలోని ఈర్లపూడిలో దశదిన ఖర్మ నిర్వహించారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై మదన్‌లాల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుమారుడు ఐఏఎస్ అధికారిగా ఉన్న బానోత్ మృగేంద్రలాల్‌ను పలువురు పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, కూనంనేని సాంబశివరావుతోపాటు గుండాల కృష్ణ, కొండబాల కోటేశ్వరరావు, కూరాకుల నాగభూషణం, అజ్మీరా వీరూనాయక్ తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ముదిగొండ: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన ముదిగొండ మండలం బాణాపురం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులకథనం ప్రకారం.. పెద్దమండవకు చెందినసాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఎనుముల అనిల్‌రెడ్డి స్కూటీపై బాణాపురం వస్తుండగా ఏపీలోని ఎన్‌టీఆర్ జిల్లా తిరువూరుకు చెందిన సర్గం శరత్‌కుమార్(35) బుల్లెట్‌పై వస్తూ ఢీకొట్టాడు. దీంతోబుల్లెట్ పైనుంచి కిందపడిన శరత్‌కుమార్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అనిల్‌రెడ్డి తలకు, చేతులకు గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఖమ్మం తరలించారు.

ఘనంగా అర్ధ శతాబ్దపు వేడుకలు



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు



ఆకాష్ క్షిపణి మాజీ డైరెక్టర్, కళాశాల పూర్వ విద్యార్థి చంద్రమౌళిని సన్మానిస్తున్న దృశ్యం

మధిర: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అర్ధ శతాబ్దపు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. జూనియర్ కళాశాలను స్థాపించి 50 ఏళ్లు గడిచిన సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను వైభవంగా నిర్వహించారు. కళాశాల ఆవరణను మామిడి తోరణాలు, కొబ్బరి ఆకులతో అలంకరించి, అతిథుల రాక కోసం రెడ్‌కార్పెట్ వేశారు. ప్రత్యేక సెట్టింగ్‌లతో బ్యాచ్‌లవారీగా గ్యాలరీలు, కుర్చీలను ఏర్పాటు చేశారు. 1970 – 1972 మొట్టమొదటి బ్యాచ్ నుంచి 2025 వరకు బ్యాచ్‌లవారీగా ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి పూర్వ విద్యార్థుల పేర్లను నమోదు చేయించుకున్నారు. నాటి గురువులు, పూర్వ విద్యార్థులు వృద్ధాప్యంలోకి చేరడంతో పాటు వీఐపీల రాకతో అక్కడ ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. 55 ఏళ్ల పూర్వ విద్యార్థులు ఒకేవేదిక పైకి చేరుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గురువులతో పాటు దేశ విదేశాల్లో ఉన్నత స్థాయిలో స్థిరపడిన ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. వేలాదిమంది తరలిరావడంతో కళాశాలలో పండగ వాతావరణం నెలకొంది.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి



శివ (ఫైల్)

కొణిజర్ల: ట్రాక్టర్ ట్రక్కుకు వెల్డింగ్ చేస్తుండగా విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన శనివారం రాత్రి మండలంలోని తనికెళ్లలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సూరజ్ కథనం ప్రకారం.. మండలంలోని తనికెళ్ల శివారులో షేక్ జిలానీ వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. అందులో కొణిజర్లకు చెందిన బండారు శివ (23) పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి వెల్డింగ్ చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్‌కు గురవగా.. ఖమ్మం తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. మృతుడికి తల్లి, చెల్లి ఉన్నారు. తండ్రి గతంలోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి తల్లి ముత్తమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం బస్టాండ్ సమీపంలోని మున్నేరు ఒడ్డున పేకాట ఆడుతున్న మండలంలోని పందిళ్లపల్లి, బొప్పారం, ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ధంసలాపురం గ్రామాలకు చెందిన ఏడుగురు వ్యక్తులను చింతకాని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.19,640 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

తుమ్మల చెరువులో పర్యాటకుల పాట్లు



తుమ్మలచెరువు వద్ద బోటు కోసం వేచి ఉన్న పర్యాటకులు

అశ్వాపురం: మండల పరిధిలోని తుమ్మలచెరువు వద్ద బోటింగ్ వద్ద తగిన సౌకర్యాలు లేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. చెరువు వద్ద రెండు చిన్న బోట్లు మాత్రమే ఉన్నాయి. దీంతో జలవిహారం చేసేందుకు పర్యాటకులు గంటల తరబడి వేచి ఉండాల్సివస్తోంది. వసతి, తాగు నీటి, చిన్న పిల్లలకు స్నాక్స్ వంటి సౌకర్యాలు కూడా లేవు. తుమ్మలచెరువు వరకు రహదారి కూడా సక్రమంగా లేదు. అధికారులు స్పందించి పర్యాటకులకు తగిన సౌకర్యాలు కల్పించాలని, పార్క్ ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

క్లుప్తంగా...

హైరిస్క్ గర్భధారణపై జాతీయ సదస్సు

పాల్గొన్న గైనకాలజిస్టులు, సర్జన్లు

హైదరాబాద్: యశోద హాస్పిటల్స్–హైటెక్‌సిటీ ప్రసూతి, గైనకాలజీ విభాగం అధ్వర్యంలో హైరిస్క్ గర్భధారణపై ఆదివారం జాతీయ స్థాయి సదస్సు, లైవ్‌వర్క్‌షాప్ నిర్వహించారు. 500 మందికి పైగా గైనకాలజిస్టులు, సర్జన్లు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ ఈ సదస్సులో విభిన్న వైద్య విభాగాల నుంచి అనుభవజ్ఞులైన ప్రముఖ వైద్య నిపుణులు పాల్గొన్నారన్నారు. హైరిస్క్ ప్రెగ్నెన్సీ నిర్వహణలో ఇబ్బందులను అధిగమిస్తూ నూతన మార్గదర్శకాలు, ఆధునిక సాంకేతికతలను ఉపయోగించి సంక్లిష్టమైన సర్జరీలను మరింత సులభంగా, ఖచ్చితత్వంతో ఎలా నిర్వహించాలో అవగాహన కల్పించారనానరు. యశోద హాస్పిటల్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ కృష్ణవేణి మాట్లాడుతూ ప్రసూతి సమయంలో అత్యంత క్లిష్టమైన గర్భధారణలో విజయవంతంగా తల్లీబిడ్డలను క్షేమంగా కాపాడడం ఈ సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు.

బాలు పాటలు చిరస్థాయిగా నిలిచిపోతాయి: తనికెళ్ల



తనికెళ్ల భరణికి బాలు నటనా పురస్కారాన్ని అందజేస్తున్న అంబికా కృష్ణ తదితరులు

హైదరాబాద్: చరిత్ర ఉన్నంత కాలం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాటలు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటాయని తనికెళ్ల భరణి అన్నారు. ఆదివారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయగానసభలో కొండూరి భారతి సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ పుట్టినరోజు సందర్భంగా సినీనటులు తనికెళ్ల భరణికి ఎస్పీ బాలు నటనా పురస్కారాన్ని అందజేశారు. వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అధ్యక్షతన జరిగిన సభలో అతిథులుగా మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, ప్రముఖ దర్శకులు రేలంగి నర్సింహారావు , తుమ్మలపల్లి రామసత్యనారాయణ, గాయకుడు చింతలపూడి త్రినాథరావు, సినీనేపథ్య గాయకుడు వినోద్‌బాబు, రామచారి, శశికళాస్వామి విజయలక్ష్మి, దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 79 పాటలతో 21 మంది గాయనీ గాయకులతో నిర్వహించిన ఏకగళ స్వరార్చన అందరినీ అలరించింది.

తెలుగు వెలుగులు సాకారమయ్యేనా?

- ఈ విద్యాసంవత్సరం నుంచే సీబీఎస్ఈ స్కూళ్లలో తెలుగు తప్పనిసరి చేస్తామన్న సీఎం
- ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ అన్ని రకాల స్కూళ్లలో అమలుకు ఆదేశాలు
- పక్కాగా అమలుకు వెంటనే మార్గదర్శకాలు ఇవ్వాలంటున్న టీచర్లు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: తెలుగుకు మళ్లీ పూర్వ వైభవం తెచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనలు చేస్తోంది. అన్ని రకాల సిలబస్ స్కూళ్లలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటనపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతంలో తెలుగు మీడియంలో చదువుకొని ఉన్నత స్థానాలను అధిరోహించినవారు ఎందరో ఉన్నా, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంగ్లిష్ మీడియానికి ప్రాధాన్యం పెరిగింది. ఈ క్రమంలో తెలుగు ప్రాధాన్యం తగ్గిపోతోంది. అయితే మాతృ భాషలో చేసే వ్యక్తీకరణ మరే ఇతర భాషల్లోనూ రాదన్నది భాషా నిపుణుల అభిప్రాయం. ఐదో తరగతి వరకు మాతృ భాషలో బోధన ఉండాలని, 8వ తరగతి వరకు ఉంటే మరింత మేలని నూతన విద్యా విధానం చెబుతోంది. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు అన్ని రకాల సిలబస్ స్కూళ్లలో తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేస్తామని ఆ దిశగా చర్యలు చేపడతామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ వంటి సిలబస్ కలిగిన స్కూళ్లలోనూ అమలు చేయాలని స్పష్టం చేశారు. అయితే ఈనెల 12 నుంచే పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో దీనికి సంబంధించిన మార్గదర్శకాలు జారీ కావాల్సి ఉంది.

గతంలో ఉత్తర్వులు జారీ చేసినా..

రాష్ట్రంలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయాలని తెలంగాణ (కంపల్సరీ టీచింగ్ అండ్ లెర్నింగ్ ఆఫ్ తెలుగు ఇన్ స్కూల్స్) యాక్ట్ 2018ను రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. గెజిట్ నోటిఫికేషన్ కూడా జారీ చేసింది. అదే ఏడాది జూన్ 30వ తేదీన దశల వారీగా తెలుగు అమలు కోసం జీవో 24ను కూడా జారీ చేసింది. అయినా రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో తెలుగు తప్పనిసరి సబ్జెక్టుగా పక్కాగా అమలుకు నోచుకోవడం లేదు. రాష్ట్ర సిలబస్ కలిగిన కొన్ని ఇంగ్లిష్ మీడియం పాఠశాలలతో పాటు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ), కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్ (ఐసీఎస్ఈ), ఇంటర్నేషనల్ బకలరియట్ (ఐబీ) సిలబస్ కలిగిన ఇంటర్నేషనల్ స్కూళ్లు తెలుగు తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయడం లేదు. రాష్ట్ర సిలబస్ కలిగిన చాలా ఇంగ్లిష్ మీడియం స్కూళ్లు, సీబీఎస్ఈ స్కూళ్లు తెలుగు ఆప్షనల్ సబ్జెక్టుగా మాత్రమే అమలు చేస్తున్నాయి. తప్పనిసరి కాకపోవడంతో విద్యార్థులు ఎవరూ తెలుగు సబ్జెక్టును పెద్దగా ఎంచుకోవడం లేదు. దీంతో ఆయా స్కూళ్లలో తెలుగు భాష అమలుకు నోచుకోవడం లేదు.

మెజారిటీ స్కూళ్లలో అమలు అంతంతే

ప్రస్తుతం రాష్ట్రంలో 42,901 పాఠశాలలు ఉండగా, అందులో 59,35,927 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం పాఠశాలల్లో 10,741 ప్రైవేటు పాఠశాలలు ఉండగా వాటిల్లో 33,93,010 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే ఆ స్కూళ్ల అన్నింటిలో తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా అమలు చేయడం లేదు. కొన్ని స్కూళ్లు అమలు చేస్తుండగా, మరికొన్ని ఆప్షనల్‌గా అమలు చేస్తున్నాయి. మరోవైపు 533 సీబీఎస్ఈ సిలబస్ కలిగిన స్కూళ్లు ఉండగా, మిగితావి ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్ స్కూళ్లు ఉన్నాయి. వాటిల్లో ప్రస్తుతం దాదాపు 4 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆయా పాఠశాలల్లోనూ తెలుగు పక్కాగా అమలుకు నోచుకోవడం లేదు.

ఇకనైనా 'తప్పనిసరి తెలుగు'అమలయ్యేనా

సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ సిలబస్ కలిగిన పాఠశాలల్లో 9, 10 తరగతులకు సంబంధించిన రాష్ట్రేతర విద్యార్థుల కోసం సింపుల్ తెలుగు పాఠ్య పుస్తకం 'వెన్నెల'ను సీఎం రేవంత్‌రెడ్డి గత ఫిబ్రవరి 26వ తేదీన ఆవిష్కరించారు. ఆ సమయంలో అన్ని రకాల సిలబస్ కలిగిన స్కూళ్లలో తెలుగును తప్పనిసరి సబ్జెక్టుగా 2025–26 విద్యా సంవత్సరంలో అమలు చేస్తామని చెప్పారు. దానిని ఇప్పుడు ఆచరణలోకి తీసుకురావాల్సి ఉంది. ఇది అమల్లోకి వస్తే ప్రైవేటు పాఠశాలల్లో తెలుగు టీచర్లకు డిమాండ్ పెరుగుతుందని భావిస్తున్నారు.

వెంటనే మార్గదర్శకాలు ఇవ్వాలి



సీబీఎస్ఈ స్కూళ్లలో తెలుగు సబ్జెక్టు ఉండాల్సిందే. తప్పనిసరి కాకపోవడం వల్ల పిల్లలకు మాతృభాష రావడం లేదు. నాలుగేళ్ల నుంచి అమలు చేస్తామంటున్నారు. ఇప్పటికీ మార్గదర్శకాలు ఇవ్వలేదు. వెంటనే ఇవ్వాలి.

– సునీల్, తెలుగు టీచర్, జగిత్యాల

అమలు చేస్తే మేలు



ప్రస్తుతం ప్రైవేటు స్కూళ్లలో తెలుగు టీచర్ల సంఖ్య చాలా తక్కువ. అందులోనూ సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీలాంటి స్కూళ్లల్లో మరింత తక్కువే. ఇప్పుడు తెలుగు సబ్జెక్టును తప్పనిసరి చేస్తే తెలుగు టీచర్లకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి.

–కనుకు గోపి, తెలుగు పండిట్, సూర్యాపేట

అవకాశాలు పెరుగుతాయి..



తెలుగు పండిట్ శిక్షణ చేసిన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి. ప్రతి స్కూల్లో పోస్టులు వస్తాయి. దీంతో వారి జీవితాలు మెరుగు పడతాయి.

–గిర్ని అంజాగౌడ్, పాపన్నపేట, సంగారెడ్డి

తెలుగు టీచర్లకు ప్రాధాన్యం



సీబీఎస్ఈ స్కూళ్లలో తెలుగు తప్పనిసరి చేస్తే తెలుగు టీచర్లకు ప్రాధాన్యం పెరుగుతుంది. విద్యార్థులకు మేలు జరుగుతుంది. తెలుగు భాషను రక్షించుకోవడం అందరి బాధ్యత.

– సత్యంబాబు, తెలుగు టీచర్, ఖమ్మం

ప్రథమ భాషగా చేయాలి



తెలుగును ప్రథమ భాషగా చేయాలి. అన్ని రకాల సిలబస్ కలిగిన స్కూళ్లలో కచ్చితంగా అమలు చేయాలి. ఇంగ్లిష్ మీడియంలోనూ పక్కాగా అమలు చేయాలి.

–రాంబాబు, తెలుగు టీచర్, మహబూబాబాద్

మదర్ డెయిరీ మనుగడ ప్రశ్నార్థకం!



నష్టాల ఊబిలో సంస్థ

- బిల్లులు అందక 25 వేల మంది పాడి రైతుల్లో ఆందోళన
- సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపాలని విన్నపం

ఆలేరు: మదర్ డెయిరీ (నల్లగొండ, రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ లిమిటెడ్–నార్ముల్) భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. పీకల్లోతు ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయి దివాళా అంచున నిలబడింది. పాడి రైతులకు బకాయిలు చెల్లించలేని దీనస్థితి. శుక్రవారం ఆలేరు నియోజకవర్గ పర్యటనకు వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి.. మదర్‌డెయిరీకి చేయూతపై ఎలాంటి ప్రకటనా చేయకపోవడంతో ఉద్యోగులు, రైతులు పెట్టుకున్న కాస్తోకూస్తో ఆశలు ఆవిరయ్యాయి.

రైతులకు బకాయిలు ఇలా..

ఉమ్మడి నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలో మదర్ డెయిరీ కింద పాల ఉత్పత్తిదారుల సంఘాలు గుర్తింపు పొందినవి 300 ఉండగా.. ఓటు హక్కు లేని సభ్యులున్న సంఘాలు మరో 150 ఉన్నాయి. రైతుల వద్ద సేకరించిన పాలు రెండు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 23 పాల శీతలీకరణ కేంద్రాలకు వస్తాయి. ఆయా సంఘాల పరిధిలోని 25వేల మంది పాడి రైతులకు ఐదు బిల్లులకు సంబంధించి సుమారు రూ.25 కోట్లు చెల్లించాల్సి ఉంది.

అప్పులు, వడ్డీలు ఇవీ..

చిట్యాల వద్ద మదర్ డెయిరీకి సుమారు 30 ఎకరాల భూమి ఉంది. ఆ స్థలంపై గడిచిన కొన్నేళ్లుగా రూ.35 కోట్ల వరకు రుణం(ఓడీ) తీసుకున్నారు. ఇందుకు నెలకు రూ.45 లక్షల వడ్డీ చెల్లిస్తున్నారు. ఇక 600 మంది ఉద్యోగులు, ఇతర సిబ్బందికి నెలకు రూ.కోటిన్నర నుంచి రూ.2 కోట్ల వరకు జీతాలు చెల్లిస్తున్నారు. ఇతరత్రా నిర్వహణ ఖర్చులు తడిసి మోపడవుతున్నాయి.

పడిపోయిన సేల్స్..

గత రెండేళ్లగా మదర్ డెయిరీ రైతుల నుంచి సేకరించిన పాలకు, విక్రయాలకు మధ్య చాలా తేడా ఉంది. సుమారు రోజుకు లక్ష లీటర్ల పాలు సేకరిస్తే... 60వేల లీటర్లు మాత్రమే సేల్స్ ఉంటున్నాయి. దాదాపు 40వేల లీటర్ల పాలను పౌడర్‌గా చేయడం, స్కిన్ మిల్క్ రూపంలో బయట విక్రయించాల్సిన పరిస్థితి. దాంతో లీటర్‌కు రూ.6 చొప్పున సంస్థ నష్టపోయింది. దీనికితోడు ప్రైవేట్ డెయిరీలతో సవాళ్లు ఎదురవుతున్నాయి. జీతాలు కూడా ఆలస్యమవుతున్నాయని, ఏప్రిల్ నెల జీతం జూన్‌లో చెల్లించారని ఓ ఉద్యోగి 'సాక్షి'తో ఆవేదన వ్యక్తం చేశారు.

రూ. 80 కోట్ల నష్టాల్లో ఉంది

నేను చైర్మన్ అయిన తరువాత బ్యాంకర్లతో మాట్లాడుతూ.. రుణాలను సర్దుబాటు చేస్తూ ఇంత వరకు నెట్టుకొచ్చాను. ప్రస్తుతం బ్యాంకు ఖాతా ఆపరేటింగ్ అవడంలేదు. బ్యాంకర్లు టర్నోవర్ చేయనివ్వడం లేదు. మొత్తం రూ.80 కోట్ల నష్టాల్లో సంస్థ ఉంది. సంస్థను ఆదుకోవడానికి నిధులు కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతున్నాం.

-మధుసూదన్‌రెడ్డి, మదర్ డెయిరీ చైర్మన్

డబ్బులు లేవు

25 వేల మంది రైతులకు సుమారు రూ.20 కోట్ల వరకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. చిట్యాలలో ఉన్న 30ఎకరాలు విక్రయించి, రైతులకు బిల్లులు చెల్లించాలని పాలకమండలిలో నిర్ణయించారు. కానీ కొంతమంది డైరెక్టర్ల నుంచి అభ్యంతరం వ్యక్తమైంది.

-బి.కృష్ణ, మదర్ డెయిరీ ఎండీ

జిల్లా వార్తలు

కిన్నెరసానిలో ఆహ్లాదం



జలాశయంలో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: కిన్నెరసానిలో పర్యాటకులు సందడి చేశారు. మండలంలోని కిన్నెరసాని పర్యాటక ప్రాంతానికి ఆదివారం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. డ్యామ్, జలాశయం, డీర్ పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. 641 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించగా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.35,575 ఆదాయం లభించింది. 300 మంది బోటు షికారు చేయడంతో టూరిజం కార్పొరేషన్ సంస్థకు రూ.15,120 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

మహాధర్నాను విజయవంతం చేయండి..

ఇల్లెందు: సీతారామా ప్రాజెక్టు జలాలు భద్రాద్రి జిల్లా రైతాంగానికి అందించాలని, ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ఆరు గ్యారంటీలు, 13 అంశాలు అమలు డిమాండ్ చేస్తూ సోమవారం ఇల్లెందులో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు దిండిగల రాజేందర్ అన్నారు. ఆదివారం ఇల్లెందులోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 9వ తేదీన ఉదయం 10 గంటలకు మహా ధర్నా ప్రారంభం అవుతుందని, నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అత్యధికంగా తరలి రావాలని కోరారు. లక్కినేని సురేందర్, శీలం రమేష్, అజ్మీరా భావ్‌సింగ్ నాయక్, జేకే శ్రీనివాస్, రంగనాథ్ పాల్గొన్నారు.

చినుకు జాడేది ?



వడబడుతున్న పత్తి మొక్కలు

- ఊరించి ఉసూరుమనిపించిన వానలు
- జిల్లాలో పత్తి గింజలు వేసిన రైతులు
- కొన్నిచోట్ల ఎండుతున్న మొక్కలు
- వర్షాల కోసం రైతుల ఎదురుచూపులు

బూర్గంపాడు: మే నెలలో కురిసిన అకాల వర్షాలు రైతులను పంటల సాగుకు సన్నద్ధం చేశాయి. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందస్తుగా వస్తున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. మే నెలాఖరులో ఉపరితల ఆవర్తనంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో రైతులు పంటల సాగుకు సిద్ధమయ్యారు. దుక్కులు చేసి పత్తి గింజలు వేశారు. కొన్ని చోట్ల పత్తి గింజలు మొలకెత్తాయి. అయితే వారం రోజులుగా చినుకు పడలేదు. దీంతో రైతులు వేసిన పత్తి గింజలు కొన్నిచోట్ల మొలకలు వచ్చి ఎండిపోతున్నాయి. లక్షల రూపాయలు ఖర్చుచేసి వేసిన పత్తి గింజలు మొలకెత్తుతాయో లేదోనని ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది.

గత నెలలో వర్షాలు..

మే నెల మొత్తం జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. ఎండలు మండిపోవాల్సిన నెలలో అకాల వర్షాలు ప్రజలకు ఊరటనిచ్చాయి. మే నెలాఖరులో ఉపరితల ఆవర్తనంతో భారీ వర్షాలు కురిసి భూములు పదునయ్యాయి. ఈ తరుణంలోనే నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయని వాతావరణశాఖ ప్రకటించింది. దీంతో రైతులు సాగు పనులు మొదలుపెట్టారు. మాగాణి భూముల్లో పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకున్నారు. మే నెలాఖరులో వేసిన పత్తి గింజలు అకాల వర్షాలకు బాగానే మొలకెత్తాయి. ఆ తరువాత వేసిన పత్తిగింజలు మాత్రం వర్షాలు లేక మొలకెత్తలేదు. గత వారం, పది రోజులుగా ఎండలు దంచికొడుతుండగా ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

పత్తి సాగు షురూ..

ఉమ్మడి జిల్లాలోని మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం, మధిర, సత్తుపల్లి తదితర ప్రాంతాల్లో రైతులు పత్తి సాగు మొదలుపెట్టారు. భద్రాద్రి జిల్లాలోనే సుమారు లక్ష ఎకరాల్లో ఇప్పటికే పత్తి గింజలు వేశారు. జిల్లాలోని రైతులు పొడి దుక్కుల్లోనే విత్తనాలు వేసుకోవడం ప్రతి ఏటా పరిపాటిగా మారింది. కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర క్వింటాకు రూ. 589 పెంచటంతో ప్రస్తుతం రూ. 8,110కి చేరింది. దీంతో పత్తి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నాయి. ఇప్పటికే రైతులు లక్ష ఎకరాల్లో పత్తి సాగు చేయగా మరో లక్షన్నర ఎకరాల్లో సాగు చేసే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేశారు. వర్షాలు కురిసిన తర్వాతే విత్తనాలు వేసుకోవాలని సూచిస్తున్నారు.



ఎండను తట్టుకోలేక చెట్టుకిందకు చేరిన పశువులు

మృగశిర మన్నించేనా..?

మృగశిర కార్తె ఆదివారం ప్రారంభమైంది. ఈ కార్తెలో అయినా వర్షాలు సమృద్ధిగా పడతాయా అని రైతులు ఎదురుచూస్తున్నారు. కాలం అనుకూలిస్తే మృగశిర కార్తెలో భారీ వర్షాలు కురిసి వాతావరణం చల్లబడే పరిస్థితి ఉంటుంది. ప్రస్తుతం ఎండల తీవ్రత, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మే నెలలో అకాల వర్షాలతో ఎండల నుంచి ఉపశమనం పొందినా.. జూన్ మొదటి వారంలో మాత్రం ఎండలు, ఉక్కపోతతో విసిగిపోతున్నారు. ఎండల తీవ్రతకు జ్వరపీడితులు కూడా పెరుగుతున్నారు. మేతకు వెళ్లిన పశువులు, జీవాలు మధ్యాహ్నానికే ఇంటిదారి పడుతున్నాయి.

కలువ పూల వనం



నీటి కుంట అంతటా వనంలా వ్యాపించి ఉన్న కలువ పూలు

మండల పరిధిలోని చిన్నగొల్లగూడెం నుంచి గోపాలపురం మార్గమధ్యలో రోడ్డు పక్కనే ఉన్న నీటి కుంట కలువ పూల వనాన్ని తలపిస్తోంది. గులాబీ వర్ణంలో ఉన్న కలువ పూలు నీటి కుంట అంతటా దట్టంగా వ్యాపించి ఉన్నాయి. అటువైపుగా ప్రయాణించే వాహనదారులను ఈ పూలు మంత్రముగ్ధుల్ని చేస్తున్నాయి. చూపరులకు ఒక వనం మాదిరిలా కనిపిస్తున్నాయి.

– దమ్మపేట

ప్రయాణికులు కిటకిట.. బస్సులు కటకట..



బస్టాండ్‌లో గుండాల, మహబూబాబాద్ బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

నాలుగు రూట్లలో సరిపడాలేని ఆర్టీసీ సర్వీసులు

ఇల్లెందు: ఇల్లెందు బస్‌స్టేషన్ పరిధిలో నాలుగు రూట్లలో బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. తగిన సర్వీసులు లేక ఇబ్బందులు పడుతూ ప్రయాణించాల్సి వస్తోంది. ఆదివారం ఇల్లెందు బస్‌స్టేషన్‌లో మహబూబాబాద్, గుండాల రూట్‌లో బస్సుల కోసం ప్రయాణికులు వేచి చూడాల్సి వచ్చింది. ప్రయాణికుల రద్దీ పెరుగుతున్నా అధికారులు తగిన సంఖ్యలో సర్వీసులు పెంచడం లేదు. ఇల్లెందు–మహబూబాబాద్, ఇల్లెందు–గుండాల, ఇల్లెందు–కొత్తగూడెం, ఇల్లెందు–ఖమ్మం రూట్లలో ప్రయాణికులకు బస్సులు సరిపోవటం లేదు. ఉన్న సర్వీసులూ సమయపాలన పాటించడంలేదు. స్టేషన్‌లోనే బస్సు నిండిపోడటంతో డ్రైవర్లు పట్టణంలోని ఇతర స్టేజీల్లో నిలుపకుండా వెళ్లిపోతున్నారు. గత నెలలో ఇల్లెందులో పర్యటించిన ఆర్టీసీ ఈడీ సోలోమెన్ పలు రూట్లలో బస్సులు నడపాలని ఆదేశించారు. అయితే చెట్టుపల్లి మినహా ఇతర ఏ ఒక్క రూట్‌లో కూడా బస్సులు పెంచలేదు. రాత్రి 8 గంటల తర్వాత మహబూబాబాద్, కొత్తగూడెం, ఖమ్మం డిపోల నుంచి ఇల్లెందు వైపు సర్వీస్‌లు లేవు. కరీంనగర్ నుంచి భద్రాచలం వెళ్లే బస్సులు, భద్రాచలం నుంచి కరీంనగర్‌కు వెళ్లే బస్‌లు తప్ప సమీప డిపోల నుంచి ఇల్లెందుకు నడిచే షటిల్ సర్వీస్‌లు ఉండటం లేదు. ఖమ్మం నుంచి ఇల్లెందుకు రాత్రి సమయంలో బస్సు లేకపోవడంతో నియోజకవర్గప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ నుంచి మణుగూరు, భద్రాచలం వచ్చే రెండు, మూడు సర్వీసులను రాత్రి పూట ఇల్లెందు మీదుగా మళ్లిస్తే ప్రయాణికులకు ఇక్కట్లు తప్పే అవకాశం ఉంది. గుండాల ఎక్స్‌ప్రెస్ సర్వీస్, గుండాల–హైదరాబాద్ వెళ్లే సర్వీస్‌లు ప్రవేశపెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

వృద్ధగిరి.. అభివృద్ధికి నిధులేవి..

ముదిగొండ : కాకతీయుల కాలం నాటి అతి పురాతన దేవాలయం, వృద్ధగిరి కొండపై స్వయంభూగా వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి నిధులు లేక అభివృద్ధికి నోచుకోవడం లేదు. ముదిగొండ మండలం సువర్ణాపురం రెవెన్యూ పరిధిలో ఖమ్మం – కోదాడ జాతీయ రహదారికి సమీపంలో ఈ ఆలయం ఉండడంతో సందర్శకులు, భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు. దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి దాదాపు 40ఎకరాల భూమి ఉండగా.. కౌలు రూపంలో వచ్చే ఆదాయం ధూప, దీప నైవేద్యాలకు, ఇతర ఉత్సవాలకు సరిపోతాయి. ఇక ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు లేక, ఆలయంలో సరైన సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్, తాగునీరు, మెట్ల మార్గం, రహదారి, ఆర్చీలతో పాటు గదులు నిర్మించాలని కోరుతున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ముదిగొండ మండల పర్యటనకు వచ్చినప్పుడల్లా ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని అర్చకులు వినతిపత్రాలు సమర్పిస్తూనే ఉన్నారు. ఆలయ ప్రాంగణంలో విద్యుత్ లైన్‌తో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రజలు, భక్తులు కోరుతున్నారు.



జాతీయ రహదారి పక్కనున్న లక్ష్మీనరసింహ స్వామి ఆలయ గుట్ట



డిప్యూటీ సీఎం భట్టికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు (ఫైల్)